సాక్షి
మెదక్
సోమవారం । 18 । ఆగస్టు । 2025



మార్కెట్లు పూర్తయ్యేనా?

గత ప్రభుత్వం చేపట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసింది. వివరాలు 8లో ▸



క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ


మొబైల్ ఫోన్లకు, ఈమెయిళ్లకు వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



ఊర కుంటకు గండి!

రేగోడ్ మండల కేంద్రంలో ఊరకుంటకు గండిపడింది. తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వివరాలు 9లో ▸

గంగమ్మ ఒడిలో దుర్గమ్మ



- పరవళ్లు తొక్కుతున్న మంజీరా
- సింగూరు ఇన్‌ఫ్లో 32,766 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 43,634 క్యూసెక్కులు
- పెరిగిన పర్యాటకుల తాకిడి





పాపన్నపేట(మెదక్): దుర్గమ్మ ఆలయం నాలుగు రోజులుగా గంగమ్మ ఒడిలోనే కొనసాగుతోంది. ఆదివారం సింగూరు నుంచి విడుదల చేసిన నీటి ప్రవాహం పెరగడంతో, మంజీరా పరవళ్లు తొక్కుతూ ఘనపురం ఆనకట్టపై నుంచి పొంగిపొర్లుతోంది. ఏడుపాయల్లో జలకళ ఉట్టి పడుతుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టులోకి 32,766 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, ఇరిగేషన్ అధికారులు 43,634 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు భద్రతపై డ్యాం సేఫ్టీ కమిటీ ఇచ్చిన సూచనల మేరకు 520.5 మీటర్ల నీటి మట్టాన్ని దృష్టిలో ఉంచుకొని, నీటిని విడుదల చేస్తున్నారు. ఏడుపాయల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తన బలగాలతో అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది స్థానికంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజగోపురంలోని దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలకళను ఆస్వాదిస్తూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

భయపడాల్సిన అవసరం లేదు

- లక్ష క్యూసెక్కులు వచ్చినా ఇబ్బంది లేదు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద మంజీరా ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/టేక్మాల్: సింగూరు నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వచ్చినా ఇబ్బంది లేదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద మంజీరా ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం 50 వేల క్యూసెక్కుల ఫ్లో సింగూరు నుంచి వస్తుందని, లక్ష క్యూసెక్కుల వరకు పెరిగినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. వరద ఉధృతికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే టేక్మాల్ మండలంలోని పెద్ద చెరువు అలుగు, మండలం మీదుగా పారుతున్న గుండువాగును పరిశీలించారు. ముంపు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ రాకపోకలు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్ల మీద నీరు పూర్తిస్థాయిలో తగ్గే వరకూ ప్రజలు బయటకు రావొద్దని, సహాయక చర్యల్లో అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఇరిగేషన్, ఇతరశాఖల అధికారులు ఉన్నారు.

న్యూస్‌రీల్

మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో వినాయక మండపాలు, విగ్రహాల వివరాలను పోలీస్‌శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు నిర్వాహకులకు సూచించారు. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా సంసిద్ధమై ఉందన్నారు. వినాయక చవితి మొదలు, నిమజ్జన తేదీ, సమయం, ప్రయాణించే దారి, మండప ప్రదేశం తదితర వివరాలను పొందుపరచాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు కృషి చేయాలని, మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉంటుందని, వెంటనే డయల్ 100లో సంప్రదించాలని సూచించారు.

బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి



తెగిన బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మెదక్ కలెక్టరేట్: హవేళిఘణాపూర్ మండలంలోని ధూప్‌సింగ్ తండా వద్ద ఇటీవల కురిసిన వర్షాలతో తెగిపోయిన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బ్రిడ్జి వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే పద్మారెడ్డి కేవలం పరిశీలనకే పరిమితం అయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు పట్టించుకొని వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ద్వారా సహాయక చర్యలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లోని ఫ్లడ్ కంట్రోల్ రూం ద్వారా ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదివారం రాత్రి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను సందర్శించారు. ఈసందర్భంగా ఫిర్యాదుల రిజిస్టర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలకు సహాయం అందించడానికి, అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వరదలు వచ్చినప్పుడు, వచ్చే అవకాశం ఉన్నప్పుడు చేపట్టే నియంత్రణ చర్యల కోసమే కంట్రోల్ రూమ్ సహాయపడుతుందన్నారు.

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర

సంగారెడ్డి జోన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...అందోల్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు రూ.44కోట్ల నిధులతో నూతన రహదారుల నిర్మాణంతోపాటు రోడ్ల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణం, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనం తదితర అభివృద్ధి పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఈ జగదీశ్వర్, ఈఈ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1 హైదరాబాద్‌లో పీఆర్టీయూ నిర్వహించతలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను ఎమ్మార్సీస్ కార్యాలయం వద్ద ఆదివారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు.

రైతుబజార్.. జులుం

మార్కెట్ నిర్వాహకుల రెట్టింపు వసూళ్లు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతులు, చిరు వ్యాపారులు



అర్ధంతరంగా ఆగిన రైతు బజార్ నిర్మాణం



హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ తండాకు చెందిన గిరిజన మహిళ ముదావత్ లక్ష్మి మెదక్ మార్కెట్‌కు కూరగాయలతో పాటు జామకాయలు తెచ్చి విక్రయిస్తోంది. ఐదు రోజుల క్రితం రెండు బస్తాల్లో జామకాయలు తెచ్చింది. బస్తాకు రూ. 30 చొప్పున రూ. 60 చెల్లించాలని తైబజార్ నిర్వాహకుడు డిమాండ్ చేయటంతో రూ. 30 మాత్రమే ఇస్తానని చెప్పింది. ఆగ్రహించిన సదరు వ్యక్తి తూకం వేసే బాటును లాక్కెళ్లాడు. ఇది ఒక్క మహిళా రైతు పరిస్థితే కాదు. వందలాది మంది రైతులు, చిరు వ్యాపారస్తులది.

మెదక్‌జోన్: మెదక్ మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. ఇటీవల తైబజార్‌ను మున్సిపల్ అధికారులు 8 నెలల కోసం వేలం వేయటంతో ఓ వ్యక్తి సుమారు రూ. 8 లక్షల పైచిలుకు టెండర్ పాడి దక్కించుకున్నాడు. ఈ మార్కెట్‌లో నిత్యం వందలాది మంది రైతులు, చిరు వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తారు. వీరితో పాటు మార్కెట్‌కు వచ్చే లారీలు, కూరగాయల లోడ్లతో పాటు ఇతర సామగ్రి వచ్చినా తైబజార్ నిర్వాహకులు వసూళ్లు చేస్తున్నారు. కాగా దేనికెంత వసూలు చేయాలనే బోర్డులు మార్కెట్‌లో ఎక్కడా కనిపించడం లేదు. రైతుల నుంచి రూ. 20 నుంచి రూ. 30 వరకు వసూలు చేయాల్సి ఉండగా, అంతకు మించి వసూలు చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రైతుబజార్ నిర్మాణం ఎప్పుడో..?

రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా విక్రయించుకునేందుకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2017లో మెదక్ కూరగాయల మార్కెట్ సమీపంలో రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. 48 షాపుల విస్తీర్ణంతో చేపట్టిన భవన నిర్మాణానికి రెండు విడతల్లో ఇప్పటివరకు రూ. 6.86 కోట్లు విడుదలయ్యాయి. అయితే ఆ నిధులతో పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. మరుగుదొడ్లు, లిఫ్ట్, విద్యుత్ సౌకర్యంతో పాటు తదితర వాటి కోసం మరో రూ. 1.30 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇది పూర్తయితే 200 మంది రైతులు, చిరువ్యాపారులు పంట ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉంది. కాగా రైతుబజార్ నిర్మాణం ప్రారంభమై 8 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇది పూర్తయితే రైతులు ఎలాంటి తైబజార్ చెల్లింపులు లేకుండా ఉచితంగా విక్రయించుకునే వీలు ఉంటుంది. మార్కెట్‌కు జిల్లాలోని 8 మండలాల నుంచి రైతులు, కూరగాయలు తెస్తుంటారు. వారికి తోడు చిరు వ్యాపారులు సైతం స్థలం రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. వర్షం వస్తే అవస్థలు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

“ నిబంధనల ప్రకారం మాత్రమే తైబజార్ వసూలు చేయాలి. దౌర్జన్యం చేస్తే చర్యలు తప్పవు. దేనికి ఎంత వసూలు చేయాలనే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించాం. త్వరలో ఏర్పాటు చేయిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ కమిషనర్

భూముల రీ సర్వే చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



గంగమ్మకు మొక్కుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): నియోజకవర్గంలో ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపుతో ముంపునకు గురవుతున్న నదీ పరివాహక భూముల రీ సర్వే చేపట్టి, మార్కెట్ రేటు ప్రకారం రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఘనపురం ఆనకట్టను సందర్శించి, గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గామాతను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనకట్ట ఎత్తు పెంచడం ద్వారా నీటి సామర్థ్యం పెరిగి రైతులకు మరింత లాభం చేకూరుతుందని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అయితే ముంపునకు గురవుతున్న ప్రాంతాల విషయంలో గతంలో చేపట్టిన సర్వే పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ప్రస్తుతం ఆనకట్టకు వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిగణలోకి తీసుకొని రీ సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మెదక్ మాజీ సీడీసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, యాదయ్య, యాదాగౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమాకు 7,100 మంది



మెదక్ కలెక్టరేట్: అన్నదాత అకాల మృత్యువాత పడితే ఆ కుటుంబం రోడ్డున పడకూడదని గత ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఎంతో మంది రైతు కుటుంబాలను ఆదుకుంది. అయితే గతంలో రైతుబీమా నమోదు చేసుకోని వారే కాకుండా, ఇటీవల కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన వారికి కూడా అవకాశం కల్పించింది. ఇందుకోసం ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో ఇటీవల కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన 12,145 మంది రైతులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. దీంతో రైతులు సైతం ముందుకొచ్చారు. నిరాక్షరాస్యులైన రైతుల వివరాలు సేకరించి అధికారులే ఆన్‌లైన్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,100 మంది రైతులు బీమాకు నమోదు చేసుకున్నారు. కాగా ఈ పథకానికి ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లిస్తుంది. రైతు అకాల మృత్యువాత పడితే వారి నామినీ అకౌంట్‌లో రూ. 5 లక్షలు జమవుతాయి. అయితే కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన మరికొంత మంది రైతులు అందుబాటులో లేక నమోదు చేసుకోలేకపోయారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో ఉన్నవారు, ఇతరత్ర కారణాలతో కొంతమంది నమోదుకు ముందుకు రాలేదు. అయితే ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న ఆస్తి హత్యలకు భయపడి కొంతమంది నామినీ పెట్టడం ఇష్టం లేక నమోదు చేసుకోలేదని తెలిసింది. అత్యధికంగా పట్టణాల్లో నివసించేవారు, బడా రైతులు నమోదు చేసుకోనట్లు సమాచారం.

కొత్త కార్డుదారులకు రేషన్

సెప్టెంబర్ 1 నుంచి పంపిణీ



బియ్యంతో పాటు చేతిసంచి

మెదక్ కలెక్టరేట్: కొత్త రేషన్ కార్డుదారులతో పాటు, పాత కార్డుదారులకు సెప్టెంబర్ 1 నుంచి ప్రజా పంపిణీ కేంద్రాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. వర్షాకాలంలో పేదలు వరదలు, వర్షాల వల్ల రేషన్ తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని భావించిన కేంద్రం జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల బియ్యం కోటాను పంపిణీ చేయాలని నిర్ణయించి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సరుకులను అందజేసింది. సెప్టెంబర్ నుంచి తిరిగి నెలవారీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ నెల కోటా సన్న బియ్యం రాష్ట్రస్థాయి గోడౌన్స్ (స్టేజ్–1) నుంచి మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లకు పంపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం నుంచి ఈ ప్రక్రియను ముమ్మరం చేయనున్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారందరికీ సెప్టెంబర్‌లో సన్న బియ్యం పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికార యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలను జారీ చేశారు. ఈ లెక్కన జిల్లాలో మొత్తం 520 చౌక ధరల దుకాణాల ద్వారా 2,16,000 కార్డుదారులకు ఆహార భద్రతా పథకం కింద ఉచితంగా 4,850 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేయనున్నారు. కాగా, ఇందులో కొత్తగా జిల్లాలో 16,000 మంది కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి.

తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా రేషన్‌తో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పర్యావరణహితమైన చేతి సంచిని ప్రభుత్వం అందజేయనుంది. తెల్లటి రంగులో ఉన్న ఈ బ్యాగుపైన సీఎం, డిప్యూటీ సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటోలు ముద్రించి మధ్యలో ఇందిరమ్మ అభయహస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలతోపాటును చేతిసంచిపై ముద్రించారు. బస్తాపై 'అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదం ముద్రించారు. రూ.50 విలువ చేసే ఈ బ్యాగును ఉచితంగానే సన్నబియ్యంతోపాటు అందజేస్తారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం కోసం పర్యావరణహితంగా తయారు చేసిన ఈ బ్యాగును అందజేయనున్నారు. కాగా, బియ్యంతో పాటు అప్పట్లో ఇచ్చిన తరహాలో కందిపప్పు, చింతపండు, ఉప్పు, నూనె, పసుపు, గోధుమలు, చక్కెర తదితర సరుకునులను సైతం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సింగూరు.. పరవళ్లు

సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతుండటంతో 5గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. డ్యామ్‌లో 22టీఎంసీల నీటిని ఉంచి మిగతా నీటిని 6,8,9,10,11 నంబర్ గేట్లను మీటరున్నర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

– పుల్‌కల్(అందోల్)



మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. మట్టి కుండలో మల్లన్నకు బెల్లంపాయసం నివేదించారు. పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కొండపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి చల్లంగా చూడలని కోరుకున్నారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

ఇంకుడు గుంతలు మరిచారు

ఆసక్తి చూపని పట్టణ ప్రజలు

- పట్టించుకోని అధికారులు
- పేట మున్సిపాలిటీలో దుస్థితి

ఇంటికో ఇంకుడు గుంత నినాదం ఆచరణలో చతికిలపడింది. ప్రతి ఇంటి వద్ద విధిగా నిర్మించుకోవాలనే ఆదేశాలు బేఖాతరవుతున్నాయి. వాన నీటిని ఒడిసి పట్టి భూమి లోపలికి పంపి భూగర్భజలాలు పెంపొందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుండగా, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. - రామాయంపేట (మెదక్)



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 5,500 వరకు నివాస గృహాలున్నాయి. గతంలో నిర్మించిన, కొత్తగా నిర్మిస్తున్న గృహాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వంద రోజుల ప్రణాళికలో సైతం ఈ అంశాన్ని చేర్చింది. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలికశాఖ ఆదేశించింది. పట్టణంలో పెద్ద ఎత్తున గృహాల నిర్మాణ పనులు కొనసాగుతున్నా.. ఏ ఇంటి వద్ద ఇంకుడు గుంత కనబడటం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు సర్వే నిర్వహించి ఇంకుడు గుంతలు లేని నివాసాలను గుర్తించి నమోదు చేసుకున్నారు. వాటిని నిర్మించుకోని వారికి నోటీసులు ఇవ్వాలని అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఇంకుడు గుంత తప్పనిసరని, ఇంటి నిర్మాణానికి ముందు ఇచ్చే అనుమతిలో నమోదు చేసి ఉన్నా, ఎవరూ పట్టించుకోడం లేదు. గుంత నిర్మించుకోకపోతే నల్లా కనెక్షన్ తొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.


వృథా అవుతున్న వర్షం నీరు

వరుణుడు కరుణించినా.. వాన చుక్క భూమిలోకి ఇంకే పరిస్థితి కనిపించడం లేదు. భారీ వర్షాలు కురిసినా.. వేసవిలో సాగు, తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. వర్షం నీటిని భూగర్భంలోకి ఇంకించేందుకు అవసరమైన ఇంకుడు గుంతలు తగినన్నీ లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు ఆశించిన మేర పెరగడం లేదని భూగర్భ జల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగాలు..

- ఇంకుడు గుంతలతో భూమిలో నీటి మట్టం పెరుగుతుంది.
- ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందే అవకాశం ఉంటుంది.
- వర్షం నీరు ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తే రోడ్డుపై వరద నిలువదు.
- కాలుష్య నివారణతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయి.
- గుంతల్లో నీరు నిల్వ లేకుంటే దోమల బెడదను అరికట్టవచ్చు.

విధిగా నిర్మించుకోవాలి



ప్రతి ఇంటి వద్ద విధిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. ఇందుకు కేవలం రూ. నాలుగు వేల లోపే ఖర్చవుతుంది. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో ఎన్నో లాభాలున్నాయి. భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్య తలెత్తదు.

– దేవరాజ్, టీపీఓ, రామాయంపేట మున్సిపాలిటీ

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


ఆలేటి భూదమ్మ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఆలేటి భూదమ్మ(105) శతాధిక వృద్ధురాలు శనివారం రాత్రి వయోభారంతో మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా వీరిలో ఇరువురు కుమారులు మృతి చెందారు. భూదమ్మ నెల రోజుల క్రితం వరకు ఆరోగ్యంగా ఉందని, తన పనులు తానే చేసుకునేదని గ్రామస్తులు తెలిపారు. ఆమె ముని మనవళ్లు, మనవరాళ్లను చూసింది. అంత్యక్రియలు ఆదివారం వ్యవసాయ బావి వద్ద నిర్వహించారు.

విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

పుల్‌కల్(అందోల్): సింగూరు గురుకుల పాఠశాలలో ఆరోగ్యశిబిరం కొనసాగుతుంది. మూకుమ్మడిగా విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో మూడు రోజుల నుంచి పుల్‌కల్ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించి చికిత్స అందించారు. కొందరు విద్యార్థులు కోలుకోగా మరి కొందరికి సెలైన్‌లు ఎక్కిస్తున్నారు. గురుకుల పాఠశాలలోనే క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్ తెలిపారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు..


ఖుషి

పటాన్‌చెరు టౌన్: భార్య అదృశ్యంపై ఓ వ్యక్తిపై అనుమానం ఉందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన చందన్ కుమార్ భార్యతో వచ్చి పటాన్‌చెరు జె.పి కాలనీలో ఉంటూ, ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే చందన్ భార్య ఖుషి కొన్ని రోజులుగా సౌరబ్ కుమార్ అనే వ్యక్తితో చనువుగా ఉంటుంది. ఈ క్రమంలో ఆగస్టు 12న ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చందన్ భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి సౌరవ్ ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా అక్కడ అతనితో ఉంది. దీంతో భార్యని తీసుకొని తన ఇంటికి వచ్చాడు. తిరిగి అదే రోజు అర్ధరాత్రి ఇంటి నుంచి ఖుషి వెళ్లిపోయింది. దీంతో భార్య కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. సౌరబ్‌పై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట రాయుళ్ల అరెస్టు


పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ వివరాల ప్రకారం... మండలంలోని హోతి(బి)గ్రామ శివారులో రేకుల షెడ్‌లో కొంత మంది పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకుని, వారి వద్ద రూ. 55,350 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే 8 మొబైల్ ఫోన్లు, 7 మోటారు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకుని, సుమోటో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పటాన్‌చెరు డివిజన్‌లో..

పటాన్‌చెరు టౌన్: పేకాట ఆడుతున్న పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వినాయక్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం వచ్చింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30,400, 11 సెల్ ఫోన్లు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

లారీ కారు ఢీ..

నలుగురికి గాయాలు


అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని 161 జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం... బాన్సువాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అల్లాదుర్గం శివారులో ముందు వెళ్తున్న లారీని వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గంగాధర్, స్వరాజ్యలక్ష్మి, శంకర్, సాయిహర్షకు గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్క్ చేసిన స్కూటీ అపహరణ

నర్సాపూర్ రూరల్: పార్క్ చేసిన స్కూటీ అపహరణకు గురైంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం ప్రకారం... మండలానికి చెందిన శక్తి ఆకాశ్ పట్టణంలోని బాలాజీ టిఫిన్ సెంటర్ ఎదుట స్కూటీని పార్క్ చేసి పక్కనే ఉన్న పండ్ల దుకాణానికి వెళ్లొచ్చేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమీకృత మార్కెట్లు పూర్తయ్యేనా?

నిధులు రాక నిలిచిన పనులు
- రోడ్లపైనే విక్రయాలు.. వాహనదారులకు ఇక్కట్లు
- మంజూరైనవి 8.. పూర్తయింది ఒక్కటి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- కరువైన అధికారుల పర్యవేక్షణ


సంగారెడ్డిలో నిలిచిన మార్కెట్ నిర్మాణం

సంగారెడ్డి: ఆర్భాటంగా వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో రోడ్లపై విక్రయాలు జరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్లను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

ఒకే చోట మాంసం, చేపలు, కూరగాయల అమ్మకాలు విక్రయించేందుకు సమీకృత మార్కెట్ల నిర్మాణానికి గత ప్రభుత్వం పూనుకుంది. ప్రజలు అన్నీ ఒకేచోట కొనుగోలు చేసుకొనే వీలుంటుందని సర్కారు కూడా భావించింది. త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పలు మున్సిపాలిటీల్లో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. కానీ, ఇప్పటికీ వాటి నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వం నిధులు మంజూరుచేసి టెండర్లు పిలిచింది. జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల పరిధిలో పనులు ప్రారంభించారు. జహీరాబాద్ మినహా ఎక్కడా పనులు పూర్తికాలేదు. గుత్తేదారుల అలసత్వం, అధికారులు నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపులో జాప్యంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

నిబంధనలకు నీళ్లు..

మార్కెట్ల నిర్మాణ పనులు ఏడాదిలోపు పూర్తి చేయాలని గత ప్రభుత్వం నిబంధనలు విధించింది. పబ్లిక్ హెల్త్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు తొలుత ఆర్భాటంగా పనులు ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత బిల్లులు రాక చేతులెత్తేశారు.

ఎనిమిదికి పూర్తయింది ఒక్కటే..

జిల్లాలో ఎనిమిది వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లు మంజూరైతే.. జహీరాబాద్‌లో రూ.10కోట్లతో చేపట్టిన మార్కెట్ పూర్తయింది. సదాశివపేటలో రూ.5.5 కోట్లతో నిర్మాణాలు చేపడితే స్లాబుల వరకే పరిమితమైంది. అందోల్–జోగిపేటలో రూ.2కోట్లతో పనులు మొదలు పెట్టినా పునాది స్థాయిలో ఉంది. అలాగే అమీన్‌పూర్‌లో రూ.6.4కోట్లతో పనులు చేపడితే అదే పరిస్థితి. సంగారెడ్డిలో రూ.6.7కోట్లతో చేపట్టగా అవి కూడా స్లాబుల వరకే పరిమితమయ్యాయి. తెల్లాపూర్‌లో రూ.3.9, బొల్లారంలో రూ.6.5 కోట్లతో పనులు ప్రారంభించినా ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. నారాయణఖేడ్‌లో రూ.2.50కోట్లు మంజూరైనా ఇంకా పనులే ప్రారంభించలేదు.

త్వరలో అందుబాటులోకి

మంత్రి దామోదర చొరవతో పనులు పూర్తయిన జహీరాబాద్ సమీకృత మార్కెట్ అందుబాటులోకి రానుంది. ఇటీవల మంత్రి పర్యటనలో భాగంగా సమస్య ఆయన దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

బిల్లులు రాకే...



పట్టణంలో సమీకృత మార్కెట్ ప్రారంభమైతే అధికారులకు కొంత పనిభారం తగ్గడంతోపాటు మున్సిపల్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. వారంలో నాలుగు మార్కెట్లు కొనసాగుతుండటంతో సిబ్బందిని పంపించాల్సి వస్తుంది. అలాగే మార్కెట్లలో చెత్తాచెదారం విచ్చలవిడిగా పారవేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ త్వరగా పూర్తయితే ఆదాయం పెరుగుతుంది.

– శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి

రామకృష్ణకు పద్మచక్ర పురస్కారం



అవార్డును అందుకుంటున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ జాతీయ స్థాయి పద్మచక్ర అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి బాబుమోహన్, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. విద్యా,పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు అభినందించారు. కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్ వాంగ్వాడ్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ఆసక్తిని పెంపొందించాలని టెన్నిస్, వాలీబాల్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ వాంగ్వాడ్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వాలు క్రీడారంగానికి ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర టెన్నిస్, వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ గణేశ్ మాల్వే, వైస్ ప్రెసిడెంట్ రామేశ్వర్ కోరాడే, సిద్దిపేట జిల్లా టెన్నిస్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్‌కే హైదర్‌పటేల్, జిల్లా సెక్రటరీ నవీన్, పీడీ గోవర్ధన్‌రెడ్డి, పీఈటీ నరేశ్ కుమార్, సందీప్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఎవరి బెదిరింపులకు భయపడం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


గౌరారం సమీప పరిశ్రమలో విభాగాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): ఎవరి బెదిరింపులకు భారతీయులు భయపడరని, ప్రజాసంక్షేమం, వారి ఆత్మాభిమానమే ప్రధాని మోదీకి ముఖ్యమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గౌరారం సమీపంలో గల ఓ ప్రైవేటు పరిశ్రమలో కార్యాలయ విభాగాన్ని ఆయనే ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఇతర దేశాల వ్యవసాయోత్పత్తులు దిగుమతి చేసుకోవాలని కొన్ని దేశాలు చేస్తున్న ఒత్తిడికి తలొగ్గబోమని, ఇలాంటి బెదిరింపులకు బెదరబోమన్నారు. అంతర్జాతీయంగా ఎన్ని ఒత్తిడులు వచ్చినా భారతీయుల సంక్షేమం కోసం మోదీ నిలబడ్డారని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం ధాన్యం కొనుగోలు వ్యయం సుమారు రూ. 3వేల కోట్లు ఉండేదని, ప్రధాని మోదీ అయిన తరువాత ఇప్పుడు సుమారు రూ. 26వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్లు స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం కృషి చేస్తుందని, గడిచిన పదేళ్లలో ధాన్యం కనీస మద్దతు ధరను రూ.1300 నుంచి రూ.2600 పెంచిందని పేర్కొన్నారు. డైరీ ప్రొడక్షన్‌లో భారత్ మొదటి స్థానంలో ఉందన్నారు. సాగులో ఆధునీకత, ఆరోగ్యకర ఉత్పత్తుల కోసం ఎరువుల వాడకం తగ్గించి, నేచురల్ ఫార్మింగ్ వైపు దృష్టి సారించాలన్నారు.

సమాజ శ్రేయస్సుకు సాహిత్యం అవసరం


పుస్తకావిష్కరణలో దేశపతి శ్రీనివాస్ తదితరులు

సిద్దిపేటకమాన్: సమాజ శ్రేయస్సుకు సాహిత్యం అవసరమని రచయిత, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సుకృతి శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల మధ్య నిలిచే వారు శతక కవులని పేర్కొన్నారు. నాగరికత సారాన్ని తత్వంగా, కవిత్వంగా అందించే సృజనకారులు కవి, రచయితలు ముందు నిలుస్తారన్నారు. జీవితాన్ని తపస్సులా భావించి సాగే రచనలు చిరస్థాయిగా నిలుస్తాయని, బాలలకు చిన్నతనంలోనే పద్యాలు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, అంజయ్య, దుర్గం శ్రీను, గణేశ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొనగం రాజేశంగౌడ్

బెజ్జంకి(సిద్దిపేట): బీసీ రిజర్వేషన్‌ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొనగం రాజేశంగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీసీ వాదాన్ని ఎత్తుకుంటే ఏ పార్టీకైనా బీసీలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్‌లను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలు చేయాలన్నారు. కేవలం బీసీ ఓట్ల కోసం కాంగ్రెస్ జిమ్మిక్కులు చేసినా, ముస్లింల పేరుతో బీజేపీ అడ్డుకున్నా సహించేది లేదన్నారు.



పైకప్పు నుంచి ఊడిపడిన స్లాబు పెచ్చులు

పెచ్చులూడుతున్న పశువైద్యశాల భవనం

చేగుంట(తూప్రాన్): ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనాలు క్రమంగా తడుస్తూ ఉండటంతో నాణ్యతలేని వాటిలో పెచ్చులు ఊడిపోతున్నాయి. మండలంలోని మక్కరాజీపేట గ్రామంలోని ప్రభుత్వ పశువుల ఆస్పత్రి భవనం పైకప్పు పూర్తిగా తడిసిపోయి పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ విషయం తెలుసున్న తహసీల్దార్ శ్రీకాంత్ కొద్దిరోజుల పాటు ఇతర భవనాల్లో పశువైద్య సేవలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

128 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ఎస్-న్యాబ్, బీడీఎల్ పోలీసుల ఆపరేషన్‌లో పట్టివేత


గంజాయిని పట్టుకున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఎస్–న్యాబ్, బీడీఎల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ చౌరస్తాలో ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్–న్యాబ్, బీడీఎల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి ముత్తంగి వైపు సర్వీస్ రోడ్డుపై వస్తున్న మహారాష్ట్రకు చెందిన స్విఫ్ట్ డిజైర్, ఒడిశాకు చెందిన బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా అందులో 55 ప్యాకెట్లలో 128 కిలోల గంజాయిని గుర్తించారు. పట్టుబడిన దాని విలువ రూ.64 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఫిరోజ్ అహ్మద్, మెహబూబ్ అబ్దుల్ అంసారీ , మహ్మద్ ఇర్ఫాన్‌లతో పాటు ఒడిశాకు చెందిన సగర్ నాయక్ అలియాస్ సగర్ గజపతిలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలోని గజపతి జిల్లాలో రాజ్ కుమార్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్ర నాసిక్ జిల్లా.. మలేగావ్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో అంగీకరించారు. పోలీసులు వారి వద్ద నుంచి మొత్తం 128 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు రెండు కార్లను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. గంజాయి కేసులో కీలకంగా వ్యవహరించిన బీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ, ఎస్ఐ వెంకటేశం, సంగారెడ్డి జిల్లా ఎస్–న్యాబ్ సీఐ నాగేశ్వర్‌రావు సిబ్బంది, క్లూస్ టీం సిబ్బందిని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


కార్తీక్

చేగుంట(తూప్రాన్): యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... కాలనీలోని శ్యామల, యాదగిరి దంపతుల రెండో కుమారుడు ఉప్పు కార్తీక్(22) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపు తీయగా కార్తీక్ మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందికి దించారు. ఈ ఘటనపై విషయం పోలీసులకు సమాచారం అందించగా.. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డిని వివరణ అడగగా ఆత్మహత్యకు సంబంధించి ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పెళ్లి చేసుకోవాలని కోరితే..

- ప్రాణం తీసిన ప్రియుడు
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): మహిళను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కేసుకు సంబంధించిన వివరాలు స్టేషన్‌లో సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డి వెల్లడించారు. మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామానికి చెందిన మృతురాలు సింగిదొడ్డి నర్సమ్మ(40) భర్త 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కాగా మృతురాలితో రాంతీర్థ్ గ్రామానికి చెందిన మేత్రి రాజు(42)కు సంవత్సరం నుంచి వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో నర్సమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ రాజును డిమాండ్ చేస్తుండేది. గురువారం కంగ్టి, నారాయణఖేడ్ రోడ్డు పక్కన ఉన్న రేకుల షెడ్‌లో ఇద్దరి మధ్య పెళ్లి గురించి గొడవ జరిగింది. అప్పటికే తాగిన మత్తులో ఉన్న రాజు ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని అనుకున్నాడు. రూంలోకి తీసుకెళ్లి బండరాయితో ఆమె ఛాతీపై, కాళ్లపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. నిందితుని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన బైక్..

వ్యక్తి మృతి

నర్సాపూర్ రూరల్: చెట్టును బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారిపై రెడ్డిపల్లి సమీపంలో శనివారం జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం ... హైదరాబాద్ బండ్లగూడకు చెందిన శశాంక్ నాథ్(27) బైకుపై మెదక్ సమీపంలోని పోచారం డ్యామ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా రెడ్డిపల్లి సమీపంలోని రైస్‌మిల్ వద్ద బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న అతడిని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అంబులెన్స్‌లో నర్సాపూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లిక్ చేస్తే.. ఖాతా ఖాళీ

- ఫేక్ లింకులు పంపుతూ సైబర్ మోసాలు
- టెలిగ్రామ్, వాట్సాప్ కాల్స్‌తో బ్లాక్ మెయిల్
- అవగాహన లేక మోసపోతున్న ప్రజలు



సంగారెడ్డి క్రైమ్: ఇటీవల సైబర్ నేరగాళ్ల దృష్టి గ్రామీణ ప్రజలపై పడింది. ప్రధానంగా వారే లక్ష్యంగా సైబర్ దాడులు జరుగుతున్నాయి. అవగాహన లేకపోవడంతో, అత్యాశతో మరికొందరు సైబర్ వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. టెలిగ్రామ్ లింకులు, వాట్సాప్ కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన ఉంటే సైబర్ దాడులను అరికట్టవచ్చని నిపుణులు, సైబర్ అధికారులు సూచిస్తున్నారు.

వివిధ రూపాల్లో..

హైదరాబాద్ వంటి మహా నగరాల్లో అవగాహన రావడంతో సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను టార్గెట్ చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల నుంచి పలువురికి పోలీస్ అధికారి డీపీతో కూడిన వాట్సాప్ కాల్స్, టెలిగ్రామ్ లింకులు తరచుగా వస్తున్నాయి. మీ కుమారుడు డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడని, తప్పించాలంటే డబ్బులు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. టెలిగ్రామ్ లింకుల నుంచి డబ్బు ఆశ వల వేయడంతో మోసపూరిత లింకులు ఓపెన్ చేసి ఖాతా వివరాలు చెప్పడంతో నష్టపోతున్నారు కొందరు. లింకులు ఓపెన్ చేస్తే అకౌంట్ నుంచి నగదు మాయమవుతుంది. కాగా ఎలాంటి లింకులు ఓపెన్ చేయొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కొన్ని ఘటనలు

- ఈ నెల 12న తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. అందులో తన వివరాలు నమోదు చేశాడు. నిర్వాహకుడు చెప్పిన విధంగా కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.49 లక్షల 40 వేలు పెట్టుబడి పెట్టాడు. ఈ క్రమంలో తాను స్టాక్ మార్కెట్‌లో పెట్టిన నగదుతోపాటు లాభాలు ఇవ్వాలని బాధితుడు అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- గత నెల 29న పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్‌లో లింకు పంపించారు. లింకును ఓపెన్ చేయాలంటే కనీసం రూ.5వేలతో టాస్క్ కంప్లీట్ చేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశ చూపించారు. అది నమ్మిన బాధితుడు రూ.2లక్షల 50 వేలను పెట్టుబడి పెట్టాడు. వారం తర్వాత డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో కంగుతిన్నాడు. వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫేక్ కాల్స్ నమ్మొద్దు



అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫేక్ ఫోన్ కాల్స్, లింకులను నమ్మి మోసపోవద్దు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి. మోసపోయిన గంటలోపు(గోల్డెన్ అవర్)లోపు ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరిగే అవకాశముంటుంది.

– వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ, సైబర్ క్రైమ్